క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దాత వగ్వాల అచ్యుత రామారావు, మీనాకుమారిలు ఆర్థిక సాయంతో విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూలతో అలంకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అంగన్‌వాడీలకు బ్యాగ్‌ల పంపిణీ



సీతంపేటలో అంగన్‌వాడీలకు బ్యాగ్‌లను అందజేస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలోని సీతంపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అంగన్‌వాడీలు, ఆయాలకు బ్యాగ్‌లను ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ యాంటినో రీ సోషల్ సర్వీస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ తోట ఎడ్వర్డ్ అందజేశారు. గత 25 ఏళ్లుగా జిల్లాలో గిరిజన ప్రాంతాలు, కొల్లేరు ప్రాంతాలు, మెట్ట ప్రాంతాల్లో విద్య, వైద్య, ఆధ్యాత్మిక, మౌలిక వసతులు కల్పన రంగాల్లో సేవలందిస్తున్న ఎడ్వర్డ్‌ను పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునీత, ఉపాధ్యాయురాలు రాజ్యలక్ష్మి తదతరులు ఉన్నారు.

గంగానమ్మ ఆలయంలో హోమం



భక్తులకు ప్రసాదాన్ని అందిస్తున్న దృశ్యం

దెందులూరు : ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో శ్రీ గంగానమ్మవార్ల జాతర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం గణాచార్యులు అమ్మవారిని ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ దాసరి నాగమల్లేశ్వరి, బుజ్జి దంపతులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు, ఇతర గ్రామాలను వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉదయం హోమం చేసి, భక్తులకు అమ్మవారి పానకం, ప్రసాదం పంపిణీ చేశారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణోత్సవం



పారిజాతగిరిలో శ్రీనివాస కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం శ్రీనివాసుని కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఆరాధన, తోమాల సేవ, బాలభోగ నివేదన, తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. కళ్యాణోత్సవంలో జంగారెడ్డిగూడేనికి చెందిన శ్రీకాళహస్తి నిరంజన్‌కుమార్ కుటుంబం, కొయ్యలగూడేనికి చెందిన శ్రీనివాస్, దుర్గాదేవి దంపతులు, ఉభయధారులుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు నల్లూరి రవికుమారాచార్యులు, కుమారాచార్యులు, రాఘవాచార్యులు నూతన పట్టు వస్త్రాలు, యజ్ఞోపవేతం, మాంగల్య ధారణ, ముత్యాల తలంబ్రాలతో ఈ కల్యాణోత్సవం నిర్వహించారని ఈవో మానికల రాంబాబు తెలిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచెర్ల జగపతిరాజు, చింతలపాటి వెంకటరామరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

టి.నరసాపురం: మండలంలోని ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ఇవ్వాల్సిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు గుడెల్లి వెంకటరావు మాట్లాడతూ మండలంలో ఉపాధి కూలీలకు తొమ్మిది వారాలుగా డబ్బులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వ తీరును విమర్శించారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు, కార్మిక సంఘం నాయకులు మడకం కుమారి, ముత్యాలమ్మ, గీత, వేమన, చెల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

బరువు కాదు.. బాధ్యత

- శిరస్త్రాణం... శిరసానమామి
- హైకోర్టు ఆదేశాలతో కదిలిన పోలీసులు
- హెల్మెట్ ఆవశ్యకతపై స్పెషల్ డ్రైవ్



హెల్మెట్ పెట్టుకోనివారికి అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

దెందులూరు: సమాజంలో జీవిస్తున్నప్పుడు భయంతో పాటు బాధ్యత కూడా ఉండాలని అని ఓ రచయిత అన్నారు. ఎందుకుంటే ద్విచక్రవాహనాన్ని నడపడటంలో వీరులమని హెల్మెట్ అవసరం లేదని కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. మరికొంతమంది శిరస్త్రాణాన్ని బరువుగా భావిస్తుంటారు. ఈ ఆలోచనే ప్రాణల మీదకు తెలుస్తోంది. హెల్మెట్ తప్పకుండా ధరించాల్సిందే అని హైకోర్టు ఆదేశాలతో శిరస్త్రాణం భారం కాదు..బాధ్యత అని పోలీసులు వాహన చోదకులకు మోటారు వాహన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న సత్వరమే జరిమానాలు విధించాలి, తనిఖీలు పెంచి కఠిన చర్యలు తప్పవనే సందేశం, పంపాలి. రహదారులపై ముమ్మరంగా తనిఖీలు చేసి, నిబంధనలు పాటించనివారికి అక్కడిక్కడే జరిమానాలు విధించాలి. అప్పుడు వాహనచోదకుల్లో భయం వస్తుందని హైకోర్టు చేసిన వ్యాఖ్యలతో పోలీసుల్లో చలనం వస్తోంది. ముఖ్య కూడళ్లలో తనిఖీలు చేస్తూ హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధిస్తున్నారు. పాత చలానాలు కట్టిస్తున్నారు.

ప్రమాద ఘటనలు అధికం:

వాహనంతో రోడ్డెక్కితే భద్రంగా తిరిగి వస్తామనే నమ్మకం లేకుండా పోయింది. ర్యాష్ డ్రైవింగ్ సిగ్నల్స్‌ను జంప్ చేస్తూ అడ్డదిడ్డంగా అతివేగంగా వాహన చోదకులు వెళ్తున్నారు. హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పించడం, పాత జరిమానాలు కట్టించే దిశగా చర్యలు తీసుకుపోవడంతో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. రోడ్లపై మరణాలు హెల్మెట్ ధరించక ఎక్కువ మంది మరణించిన ఘటనలు ఉన్నాయి. వాహనాల తనిఖీని సీసీ కెమెరాల్లో చూసి జరిమానాలను విధించడంతో ఎక్కువ మంది చలానాలు కట్టడం లేదు. వాహనచోదకుల్లో భయం లేకుండా పోయింది.

వీటికి అడ్డుకట్ట వేయాల్సిందే:

యువత హెల్మెట్ ధరించకుండా స్పోర్ట్స్ బైకులపై, అతి వేగంగా వెళ్తున్నారు. రాత్రి వేళ్లలో వీరికి అడ్డు అదుపు లేకుండా పోతుంది. ర్యాష్ డ్రైవింగ్, ప్రమాదకర విన్యాసాలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాహన తనిఖీలను ఉధృతం చేస్తాం. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా మోటారు వాహన నిబంధనలను ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వాహన తనిఖీలు ముమ్మరం చేస్తాం.

హెల్మెట్ ధరించాలి



రహదారి భద్రత–మనందరి బాధ్యత. హెల్మెట్ ధరించని వారికి జరిమానాలు విధిస్తాం. పాత చలానాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటున్నాం. హెల్మెట్ ధారణపైన వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. నగరంలో ట్రాఫిక్ తగ్గించేందుకు వీలుగా ఏలూరు, తణుకు వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్నాం.

ఆర్ శివాజీ ఎస్సై దెందులూరు

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కొయ్యలగూడెం: సురక్ష హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మహేంద్ర మేదర సంక్షేమ సంఘం పేర్కొంది. గవరవరం సమీపంలోని వినాయక ఆలయం వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందిస్తామని, రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నామవరం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో హోలవతు పద్మపై పరారీ కేసు నమోదు చేసి 50 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన పరారీలో ఉన్న బోడా రాములును అదుపులోకి తీసుకొని చింతలపూడి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. అలాగే కామవరపుకోట మండలం, ఆడమిల్లి గ్రామానికి చెందిన పాత నాటు సారాయి కేసులలో నిందితులైన జజ్జవరపు మరియదాసు, ఆడమిల్లి అర్జునరావులను కామవరపుకోట మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ వారి ఎదుట హాజరు పరచి బైండోవర్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): ఉప ముఖ్యమంత్రి ఇలాకాలో సాంఘిక బహిష్కరణ చేసిన గ్రామ పెత్తందారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో కన్వీనర్ ఆగోల్ల వెంకట కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



గోపినాథపట్నంలో హోమాలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: మండలంలోని గోపినాథపట్నంలో భ్రమరాంభిక మల్లేశ్వరస్వామి ,శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి విగ్రహా ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం కొనసాగాయి. గణపతి పూజ, గోపూజ, చండీ సప్త శతిపారాయణము-హోమాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు భారీగా నిర్వహించడంతో ఆప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బ్రహ్మశ్రీ చక్రవర్తి బ్రహత్వంలో ఈపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులుతో పాటు కొట్టు మరళి దంపతులు, కుటుంబ సభ్యులు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

దెందులూరు: వేసవిలో ఏ ఒక్క గ్రామంలోనూ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని దెందులూరు ఎంపీడీవో కె.శ్రీదేవి, తహసీల్దార్ డి.సుమతి కోరారు. మంగళవారం దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల వైస్ ఎంపీపీ గొల్ల నాగరాజు అధ్యక్షతన దెందులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని శాఖ అధికారులు శాఖల వారీగా ప్రగతిని వివరించారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డివిజనల్ ఇంజనీర్లు మాట్లాడుతూ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవటమే కాకుండా ఉన్న మంచినీటి చెరువులు పూర్తి రక్షణ, పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సుబ్బారావు శాఖాపరమైన ప్రగతిని వివరించారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పరిషత్ కార్యాలయ ఏవో భీమరాజు తదితరులు ఉన్నారు.

శిశువులకు తల్లిపాలే మేలు



ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో మాట్లాడుతున్న డా.శిరీష

ఉంగుటూరు: శిశువులకు తల్లిపాలతో పోష్టికాహారం లభిస్తుందని ఉంగుటూరు ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి డా.కె.శిరీష తెలిపారు. మంగళవారం ఆస్పత్రిలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ బాలింతలు, గర్బిణులు పోషణతో కూడిన ఆహారం తీసుకోవాలని తెలిపారు. గర్బిణులు, బాలింతలు పండ్లు, కూరగాయలు, గుడ్లు, మాంసం చేపలు వంటి పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెటర్నరీ అసిస్టెంటు కృష్ణకుమారి, యోగా శిక్షకుడు అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ రత్నం, తల్లాప్రగడ భీమేశ్వరరావు, నారాయణం హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా ఎదుర్కోలు ఉత్సవం



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు



విద్యుద్దీపాలంకరణలో శ్రీనివాసుని ఆలయం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్ర ఉపాలయమైన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసుని దివ్య కల్యాణ మహోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఉదయం ఆలయ యాగశాలలో అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు హోమాది కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే ఆలయ ఆవరణలో శ్రీనివాసుడు, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి ప్రత్యేక అలంకారాలు చేసి, హారతులిచ్చారు.

నేడు శ్రీనివాసుని కల్యాణం

శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎస్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. అందులో భాగంగా కల్యాణ మండప ప్రాంతాన్ని విద్యుద్దీపాలు, పుష్పమాలికలు, మామిడితోరణాలు, అరటి బోదెలతో అలంకరించారు.

లెనిన్‌కు ఘన నివాళి



లెనిన్ జయంతిని నిర్వహిస్తున్న ఏపీ రైతు కూలీ సంఘం నాయకులు



కుక్కునూరు: లెనిన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

టి.నరసాపురం: తొలి సోషలిస్టు సమాజ నిర్మాత లెనిన్ 155వ జయంతిని మర్రిగూడెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ సోషలిస్టు విప్లవానికి దశ, దిశ చూపిన మహోన్నత వ్యక్తి లెనిన్ అని ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

ఖగార్ దాడులను ఆపాలి

మధ్య భారతంలో అపారమైన ఖనిజ సంపదను కొల్లగొట్టడానికి, ఆదివాసీలను అడవికి దూరం చేయడానికి జరుగుతున్న దాడులను వెంటనే ఆపాలన్నారు. శాంతి చర్చలు నిర్వహించాలని కేంద్రాన్ని కోరారు. సామ్రాజ్యవాద దోపిడీని ఆదివాసీలు ఉద్యమాల ద్వారా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి బాబురావు. మండల నాయకులు కాటయ్య. నాగేశ్వరరావు. అర్జున్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ ఆశయాలను కొనసాగించాలి

కుక్కునూరు: లెనిన్ ఆశయాలను కొనసాగించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ గౌస్ మాట్లాడుతూ రష్యా విప్లవోద్యమ నేత కామ్రేడ్ లెనిన్ జయంతి, పార్టీ ఆవిర్భవించిన రోజు ఒకటేనన్నారు. సీపీఐ, సీపీఎం పార్లమెంటరీ పంథా రివిజనిజం, మితవాద విధానాన్ని వ్యతిరేకిస్తూ 1969లో సీపీఐ ఎంఎల్ ఆవిర్భవించిందన్నారు. అనంతరం లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కంగాల కల్లయ్య, మచ్చా ప్రశాంత్, ఎస్‌కే మున్ని, సుజాత పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

బుట్టాయగూడెం: ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ మీ సొంతమవుతుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులతో కలెక్టర్ మమేకమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇష్టపడి చదివి విద్యలో రాణిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకుని లక్ష్యాలను సాధించగలరన్నారు. ప్రస్తుతం విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం ఉన్నత విద్యతో పాటు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థి దశలో బాధ్యతలు ఉండవని మీ బాధ్యతలను మీ తల్లిదండ్రులు మోస్తూ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు కష్టపడతారన్నారు. విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలోని తరగతి గదులను, మరుగుదొడ్లను, ల్యాబ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ టి.బాబూరావు, ఎంపీడీఓ కె.జ్యోతి, తహసీల్దార్ పీవీ చలపతిరావు, హెచ్ఎం ఇరపా గంగాదేవి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రంలో రోడ్డు విస్తరణకు మళ్లీ మార్కింగ్



రహదారి విస్తరణకు మార్కింగ్ ఇస్తున్న ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారులు.

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ప్రధాన రహదారి విస్తరణకు ఆర్అండ్‌బీ, పంచాయితీ అధికారులు మంగళవారం మళ్లీ మార్కింగ్ ఇచ్చారు. అయితే గతంలో ఇచ్చిన మార్కింగ్‌లకు భిన్నంగా ప్రస్తుతం ఇచ్చిన మార్కింగ్‌లు ఉన్నాయని గృహ యజమానులు అంటున్నారు. వివరాల్లోకి వెళితే.. భీమడోలు–ద్వారకాతిరుమల ప్రధాన రహదారిని గోదావరి పుష్కర నిధులు రూ.50 కోట్లతో నాలుగు లైన్లుగా పదేళ్ల క్రితం విస్తరించారు. స్థానిక గుడి సెంటర్‌లో మినహా మిగిలిన ప్రాంతాల్లో ఈ పనులు అప్పట్లోనే పూర్తయ్యాయి. అయితే గుడి సెంటర్ విస్తరణకు సంబంధించి హైకోర్టులో ఉన్న స్టేలు ఇటీవల తొలగిపోయినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటివరకు పలుమార్లు రహదారి విస్తరణకు అధికారులు మార్కింగ్‌లు ఇచ్చారు. అయితే తాజాగా మంగళవారం ఆర్అండ్‌బీ, పంచాయతీ అధికారుల సమక్షంలో నిర్వహించిన మార్కింగ్ పనులు బాధిత గృహ యజమానులను గందరగోళానికి గురి చేశాయి. పాత మార్కింగ్‌లకు భిన్నంగా కొత్త మార్కింగ్‌లు ఉన్నాయంటూ వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలి. ఈ రోడ్డుపై ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

జంగారెడ్డిగూడెం: ఇటీవల ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో ప్రతిభ చూపిన విద్యార్థినికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయమందించింది. స్థానిక వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ప్రథమ సంవత్సరం చదివిన ధనకొండ సురేఖ ఎంపీసీలో 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించింది. విద్యార్థిని తండ్రి ఆటో నడుపుకుంటూ చదివిస్తున్నాడు. మావనత అధ్యక్షుడు అయినాల వెంకటరమణ తెలిపారు. ద్వితీయ సంవత్సరం పుస్తకాలు కొనుగోలు, ఇతర అవసరాలు నిమిత్తం మానవత సంస్థ తరపున రూ.5 వేలు, మానవత ఉపాధ్యక్షుడు అల్లూరి రామకృష్ణ రూ.1000 విద్యార్థిని సురేఖ సమక్షంలో కళాశాల యాజమాన్యానికి అందించామని మానవత అధ్యక్షుడు అయినాల వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో మానవత సభ్యులు పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎం రాము సేవలు మరువలేనివి

దెందులూరు: మండలంలో పలు పాఠశాలల్లో హెచ్ఎంగా విధులు నిర్వహించిన తుంగ రామ్మోహన్‌రావు సేవలు మరువలేనివని యుటీఎఫ్ రాష్ట్ర నాయకులు బీవీ రమణమూర్తి, జరజాపు రంగారావు లయన్స్ క్లబ్ జిల్లా డైరెక్టర్ చొక్కా అవినాష్ రాజు అన్నారు. బుధవారం సానిగూడెంలో వారు మాట్లాడుతూ హెచ్ఎం రాము ఉపాధ్యాయులకు విద్యార్థులకు వారధిగా గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి కమిటీ గౌరవ అధ్యక్షునిగా గాలాయగూడెం కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా ఎనలేని సేవలు అందజేశారన్నారు. పది కాలాలపాటు ఆయన సేవలు గుర్తుంటాయని కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

పండించిన ధాన్యంపై ఆంక్షలేల ?



భీమడోలులో ఎగుమతికి సిద్ధంగా ధాన్యం బస్తాలు



రోడ్లపై ఆరబోసిన ధాన్యం



మెట్ట గ్రామాల్లో వరిని కోస్తున్న వరి కోత యంత్రం

- ప్రతి ధాన్యం గింజను కొంటానన్న ప్రభుత్వం
- 60శాతం మాత్రమే కొనుగోలుకు ఏర్పాట్లు
- ఆంక్షలు సడలించాల్సిందే

భీమడోలు: రైతులు పండించిన ధాన్యం ప్రతి గింజను కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ఆచరణలో అమలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులు పండించిన ధాన్యంలో 60శాతం మాత్రమే కొనుగోలు చేయాలన్న ఆంక్షలతో మిగిలిన ధాన్యాన్ని రైతులు ఏం చేయాలో తెలియని దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆరుగాలం పండించిన దాళ్వా ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. పండించిన ధాన్యం మొత్తాన్ని ఒకేసారి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో వరి మాసూళ్ల చేసుకున్న రైతుల నుంచి నిబంధనల మేరకు కొంత ధాన్యాన్ని కొనుగోలు చేశారు. మిగిలిన 40శాతం ధాన్యం ఎగుమతులకు ఉన్నతాధికారుల అనుమతుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాతావరణం ఆందోళన కలిగించేలా ఉండడంతో రైతుల గుండెల్లో రైళ్ల పరిగెడుతున్నాయి.

ఆశాజనకంగా దిగుబడులు. అప్పులు తీరేది ఏలా?

సార్వాలో ఆకాల వర్షాల వల్ల పంట దెబ్బతింది. దీనితో రైతులకు పెట్టుబడులు ఖర్చులు రాక అప్పులు పాలైయ్యారు. ఎక్కువగా రైతులు ఎంటీయు 1121, పీఆర్ 126 వరి విత్తనాలను సాగు చేశారు. 120 రోజుల పంటలు కావడంతో రైతులంతా సాగుకు ఆసక్తిని చూపారు. అయితే దాళ్వాలో ఆశాజనకంగా వరి పంట దిగుబడి వచ్చింది. ఏకరాకు 50 నుంచి 55 బస్తాలు దిగుబడులు రావడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఏకరాకు రూ.30 నుంచి 35వేల వరకు పెట్టుబడి ఖర్చులు చేశారు. దీంతో చేతికందిన ధాన్యాన్ని ఒకే సారి అమ్ముకుని అప్పులు తీర్చుకుందామని భావించిన రైతులు ప్రభుత్వ ఆంక్షలతో నిరాశే ఎదురైంది.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

మండల వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల వారీగా పౌరసరఫరా విభాగం అధికారులు ధాన్యం సేకరణపై టార్గెట్లు నిర్ధారించి, అందుకు తగిన విధంగానే గోనె సంచులు అప్పగించారు. అయితే అధిక దిగుబడులు రావడంతో అంబర్‌పేట, కురెళ్లగూడెం, గుండుగొలను రైతు సేవా కేంద్రాల టార్గెట్లు పూర్తి అయ్యాయి. దీంతో పలు ఆర్ఎస్‌కే పరిధిలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. రైస్ మిల్లర్లకు ఇచ్చిన లక్ష్యాలు కూడా కావడంతో మిల్లులకు ధాన్యం ఎగుమతులు కావడం లేదు. దీంతో ఇంకా కళ్లాల్లో ధాన్యం ఉంది.

దాళ్వా ధాన్యం సేకరణ లక్ష్యం 56వేల మెట్రిక్ టన్నులు

వాస్తవానికి మండలంలో 13వేల ఏకరాల్లో వరిని సాగు చేశారు. పంట కోత ప్రయోగాల్లో ఆశాజనకమైన దిగుబడులు వచ్చాయని గణాంకాలు చెబుతున్నాయి. ఆశాజనకమైన దిగుబడులతో 56 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. ఇప్పటి వరకు 9500 ఏకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. అదే విధంగా 22వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు పంపారు. ఇంకా 34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దనే ఉంది. కేవలం రైతులు పండించిన ధాన్యంలో 60 శాతం మాత్రమే కొనాలన్నా ఆంక్షలు రైతులను నిద్రపోనివ్వకుండా చేస్తున్నారు. మిగిలిన ధాన్యాన్ని బరకాలపై కప్పి ఉంచి భద్రపర్చుకుంటున్నారు. ఒక వైపు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలుకు ఉన్న ఆంక్షలు సడలించాలని ముక్తకంఠంతో రైతులు వేడుకుంటున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఎస్‌పీవీ ఉషారాణి వివరణ కోరగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. కొన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో నిర్దేశిత ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి అయ్యిందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరిస్తున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు చర్యలు చేపడుతున్నాం.